ప్రజాశక్తి

ఆదివారం 24 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఆపదలో ఆపద్బాంధవులు

- 108 సిబ్బందిపై నానాటికీ పెరుగుతున్న పని ఒత్తిడి
- సిబ్బంది కొరత
- ఉద్యోగ భద్రత కరువు
- సమస్యలను పరిష్కరించాలని 25 నుంచి సమ్మె బాట

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షలు చేస్తున్న 108 సిబ్బంది (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆపదొస్తే ఆపద్బాంధవుల్లా వచ్చే 108 సిబ్బందికి కష్టం వచ్చిపడింది. ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా, రోగంతో కదల్లేని స్థితిలో మనిషి ఉన్నా.. సమాచారం అందిస్తే చాలు కుయ్.. కుయ్ మంటూ నిమిషాల వ్యవధిలో వాహనాలను తీసుకొచ్చే పైలెట్, ఇఎంటిలు నేడు సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని, గత ప్రభుత్వం రద్దు చేసిన రాయితీలను పునరుద్ధరించాలని కోరుతూ ఈసరికే ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు 108 సిబ్బంది వారి వారి యూనియన్లతో కలిపి వినతి పత్రాలను సమర్పించినా ఎవ్వరికీ పట్టలేదు. ఈ క్రమంలో తమ డిమాండ్లను నెరవేర్చాలని, లేకుంటే ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని 108 సిబ్బంది ఇటీవల ప్రకటించారు. ఇప్పటికే 108 ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకత్వంలో సమ్మెకు అంతా సన్నద్ధమయ్యారు.

ప్రభుత్వం స్పందించాలి

అనుకున్న విధంగా వీరి సేవలు నిలిచిపోతే ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కోకతప్పదు. గిరిజన ప్రాంతంలో సేవలు నిలిచిపోతే డోలీ మోత తప్పదు. సకాలంలో ఆసుపత్రికి చేరుకోలేకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా లేకపోలేదు. 108 సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను సాధ్యమైనంత తొందరగా ఆసుపత్రులకు తీసుకువెళ్లి.. ఎందరో ప్రాణాలను కాపాడిన సందర్భాలు ఉన్నాయి. 108 సిబ్బంది సమ్మెలోకి వెళితే అత్యవసర సమయంలో రోగులను తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉండదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మిగతా 2లో..

సమావేశంలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

పథకాలు అందరికీ అందినప్పుడే అభివృద్ధి

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - అనకాపల్లి : సంక్షేమ పథకాలు అందరికీ అందినప్పుడే అభివృద్ధి జరిగినట్టు లెక్క అని శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసి రాష్టానికే అనకాపల్లి జిల్లా ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం 58 సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటి వివరాలు ప్రజలకు తెలిసేలా, వినియోగించుకొనేలా అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. అనకాపల్లి కలెక్టరేట్‌లో అనకాపల్లి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమీక్షా సమావేశం శనివారం అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సిఎం.రమేష్ అధ్యక్షతన జరిగింది. అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా, శాసనసభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర, మండల పరిషత్ అధ్యక్షులు హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. డ్వామా, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ, ఆరోగ్య, నైపుణ్యాభివృద్ధి, లీడ్ బ్యాంకు, విద్య, జాతీయ రహదారులు తదితర శాఖలపై సమీక్ష సాగింది. ఈ సందర్భంగా అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాల వివరాలు మిగతా 2లో..

ప్రభుత్వ పాఠశాలల పనివేళల మార్పు సరికాదు

▶ వార్త 6లో..

26న దేశ వ్యాప్త ఆందోళనపై విస్తృత ప్రచారం

▶ వార్త 5లో..

కానరాని 'మన ఇల్లు - మన గౌరవం'

▶ వార్త 7లో..

ఎయులో ఏర్పాట్లును పరిశీలిస్తున్న అధికారులు

ప్రధాని సభకు జోరుగా ఏర్పాట్లు

ఈ నెల 29న విశాఖలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సభ నిర్వహించనున్న నేపథ్యంలో అక్కడకు టెంట్లు, ఇతర సామగ్రిని శనివారం సాయంత్రానికే చేర్చారు. ఏర్పాట్లును సీనియర్ ఐఎఎస్ అధికారి మల్లికార్జున, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

అదానీ అవినీతిపై సిపిఎం నిరసన

అతనితో ఎపి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అవినీతికి పాల్పడ్డ అదానీతో పాటు ముడుపులు తీసుకున్న అందరినీ తక్షణమే అరెస్టు చేయాలని, ఎపి ప్రభుత్వం అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శనివారం సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. అదానీ బొమ్మతో ఉన్న ఫ్లెక్సీని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో రూ.2029 కోట్ల భారీ ముడుపులను అధికార, ప్రతిపక్ష పార్టీలకు ముట్టజెప్పినట్లు అమెరికా తూర్పు న్యూయార్క్ జిల్లా కోర్టు తెలియజేసిందని, అదానీకి ప్రజల సంపదను దోచిపెట్టేందుకు ఈ భారీ అవినీతి చోటుచేసుకున్నట్లు స్పష్టమవుతోందని అన్నారు. ఎపి ప్రభుత్వం అదానీకి కేటాయించిన భూములను, ప్రజల సంపదను వెనక్కి

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

రాబట్టాలని, రాష్ట్రంలో అదానీ డిస్కంలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని కోరారు. గౌతమ్ అదానీ, మరో ఏడుగురు నిందితులు సెకీ నుంచి ఆంధ్రప్రదేశ్ డిస్కంలు 7 గిగావాట్లు సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేయడానికి 2019-24 మధ్యకాలంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం రూ.2029 కోట్లు ముడుపులు తీసుకున్నట్లు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆపదలో ఆపద్భాంధవులు

ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

డిమాండ్లు ఇవీ..

108 అంబులెన్స్ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి. అందులో పని చేసే ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. 108 వ్యవస్థలో రోజుకు రెండు షిఫ్ట్‌లలో 12 గంటల పాటు పనిచేసే విధానాన్ని మార్చి, మూడు షిఫ్టులలో 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలి. 108 సర్వీసులో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ నియామకాల్లో తెలంగాణ ప్రభుత్వం వలే వెయిటేజీ మార్కులు అందించాలి. వైద్య ఆరోగ్య శాఖలో ఇఎంటి పోస్టుల నియామకాలలో 108లో పనిచేస్తున్న ఇఎంటిలను నియమించాలి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉండగా అమలు చేసిన జిఒ 49ని అనుసరించి ప్రతి నెలా రూ.4 వేలు ఇన్సెంటివ్ చెల్లింపును తిరిగి పునరుద్ధరించాలి. సహజ, ప్రమాద మరణం పొందిన ఉద్యోగి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియో అందివ్వాలి. అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం ఇవ్వాలి. ఉద్యోగుల పిఎఫ్ నిధులను ఉద్యోగుల వేతనాలు నుంచి కాకుండా యాజమాన్యం వాటా నుంచి వసూలు చేయాలి. గత ప్రభుత్వం నాలుగు సంవత్సరాలుగా వేతనాల స్లాట్స్‌ను అప్డేట్ చేయలేదుగనుక కూటమి ప్రభుత్వం అప్డేట్ చేసి వేతనాలు పెంచాలి. ప్రస్తుత నిర్వహణ సంస్థ నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను, పూర్తిగా చెల్లించే బాధ్యతను ప్రిన్సిపల్ ఎంప్లాయిర్‌గా ప్రభుత్వం చేపట్టాలి. మరమ్మతులకు గురైన వాహనాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలి లేదా వాటి స్థానంలో కొత్తవి ఇవ్వాలి. 108 వాహనాలకు శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలి. వేతనాల చెల్లింపు ఆలస్యం కాకుండా ప్రతి నెలా 1వ తేదీన ఇవ్వాలి.

జిల్లాలో సిబ్బంది కొరత

విశాఖ జిల్లాలో 108 వాహనాలు 15 ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా జిల్లా మొత్తం మీద 2500 నుంచి 3000 వరకు అత్యవసర కేసులను వైద్యం నిమిత్తం ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఈ మొత్తం వాహనాలలో 75 మంది పని చేస్తున్నారు. వీరంతా రోజులో రెండు షిఫ్ట్‌లలో విధులు నిర్వహిస్తున్నారు. ఏడు ఇఎంటి ఖాళీలు ఉన్నాయి. వాటిని భర్తీ చేయాలి. సిబ్బందిని సీనియారిటీ ఆధారంగా మూడు స్లాబులుగా విభజించి వేతనాలు చెల్లిస్తున్నారు. పైలెట్‌కు రూ.18 వేలు, రూ.23 వేలు, రూ.28 వేలు చొప్పున చెల్లిస్తుండగా, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఇఎంటి)లకు రూ.20 వేలు, రూ.25 వేలు, రూ.30 వేలు చెల్లిస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అత్యవసర సర్వీసుల్లో పని చేస్తున్న మేమంతా విధి నిర్వహణలో తీవ్రమైన పని ఒత్తిడికి గురవుతున్నాం. ఎంతోమంది ప్రాణాలను, ఆరోగ్యాలను సకాలంలో కాపాడుతున్నామనే సంతోషంలో మేం చేస్తున్న కష్టాన్ని మరిచిపోతున్నాం. పనికి తగిన జీతం, ఉద్యోగ భద్రత కల్పిస్తే మా కుటుంబాల జీవనం సాఫీగా సాగుతుంది. కూటమి ప్రభుత్వం ఆ పని చేస్తుందనే నమ్మకం మాకు ఉంది.

ఎస్.బంగారురాజు,
జిల్లా అధ్యక్షులు, 108 ఎంప్లాయిస్ యూనియన్, విశాఖపట్నం జిల్లా.

108ని ప్రభుత్వమే నిర్వహించాలి

108 సర్వీసులను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడం వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాం. సకాలంలో జీతాలు ఇవ్వడం లేదు. యాజమాన్యం వాటాగా చెల్లించాల్సిన పిఎఫ్ సొమ్మును మా జీతాల్లోంచి చెల్లిస్తున్నారు. ఉద్యోగ భద్రత లేని పరిస్థితి నెలకొంది.

డి.సురేష్, కోశాధికారి,
108 ఎంప్లాయిస్ యూనియన్, విశాఖ జిల్లా

అదానీ అవినీతిపై సిపిఎం నిరసన

అమెరికా కోర్టు వెల్లడించిందని తెలిపారు. సౌర విద్యుత్ యూనిట్‌కు 50 పైసలకే ప్రజలకు అందించొచ్చని నిపుణులు చెబుతున్నా ప్రభుత్వం వినలేదన్నారు. అదానీ లాభాల కోసం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపడానికే ప్రభుత్వం ముడుపులు తీసుకుని పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఈ విషయంపై ఇప్పటికీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నీ ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు నష్టదాయకమని ప్రారంభం నుంచి సిపిఎం తెలుపుతున్నా ప్రభుత్వం వినిపించుకోలేదన్నారు. 2019-20 మధ్య సెకి ఒప్పందమేగాక రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లు, విశాఖలో డేటా సెంటర్, గంగవరం పోర్టు వంటి వివిధ ప్రాజెక్టుల విషయమై అదానీ గ్రూపు సంస్థతో ఒప్పందం చేసుకుందన్నారు. తక్షణమే ఈ ఒప్పందాలన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గంగవరం పోర్టును స్టీల్‌ప్లాంట్‌కు అప్పగించాలని, డేటా సెంటర్‌ను ప్రభుత్వమే నిర్వహించాలని సూచించారు. ఎపిలో అదానీకి కట్టబెట్టిన ప్రజల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, వి.కృష్ణారావు, నాయకులు జి.అప్పలరాజు, కె.కుమారి, వై.రాజు, పి.వెంకటరావు, జివిఎన్.చలపతి, కెఎం.కుమార్‌మంగళం, అప్పారావు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అందరికీ అందినప్పుడే అభివృద్ధి

తెలియక, ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక ప్రజలు లబ్ధి పొందలేక పోతున్నారన్నారు. పథకాలను ప్రచారం చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. అధికారులు తమ శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో ప్రచారం కల్పించాలని తెలిపారు. చాలా పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోమంటున్నారని, ప్రజలకు అవగాహన ఉండటం లేదని, ఈ నేపథ్యంలో ప్రతి మండలానికీ పథకాల అమలుకు ఒక అధికారిని నియమించాలని తెలిపారు. మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి పథకాన్నీ లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. పార్లమెంటు సభ్యులు సిఎం.రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 38 శాఖల ద్వారా 58 సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. సమావేశంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్ బాబు, జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల పొట్టకొట్టి ప్లాంట్‌ను నడుపుతారా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్రంలోని బిజెపి మోడీ సర్కారు, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం రెండూ కూడబలుక్కుని ఉక్కు ఊపిరి తీసేసే కుట్రల పరంపరలో భాగంగా కార్మికుల పొట్ట గొట్టేలాగ జీతాలు ఇవ్వకుండా ఎండగట్టే పరిస్థితులను తీవ్రం చేశాయి. కార్మికుల జీతాలను ఆపేసి ప్లాంట్‌ను నడుపుతారా ? అని సాధారణ పౌరులు సైతం నివ్వెరపోయేలాగ గడచిన ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుంటే రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన పార్టీలు నిమ్మకు నీరెత్తిన చందాన ఉండడంపై సర్వత్రా ఆవేదన వ్యక్తమవుతోంది. 1380 రోజులుగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు రోడ్డెక్కని రోజు లేదు. ఇటీవలే కార్మిక, ఉద్యోగుల పిల్లలు, మహిళలు, కుటుంబ సభ్యులు సైతం కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొని జీతాలు చెల్లించాలని, కడుపులు మాడ్చే పని మానుకోవాలని యాజమాన్యాన్ని, ప్రభుత్వాలను వారంతా అర్థించారు. ఈ నెల 29న విశాఖకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రాక సందర్భంగా తమ ఆవేదనను తెలియజేయాలని వారంతా భావిస్తున్నారు.

ప్లాంట్‌కు కేంద్రం అందించిన ప్యాకేజీ ఎటు పోయింది?

కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమను ఎలా నడపాలనుకుంటుందో చూస్తే, రూ.వందల కోట్లు ప్యాకేజీ ఇచ్చేసినట్లు తమ మీడియా సంస్థల ద్వారా చేసే ప్రకటనలు చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం నుంచి రూ.500 కోట్లు తొలిసారి సాయం వచ్చింది. దీంట్లో జిఎస్‌టికి ప్లాంట్ రూ.233 కోట్లు

చెల్లించింది. అలాగే మరో దఫా రూ.1140 కోట్లను కేంద్రం ఇటీవల ఇవ్వగా దీనంతటినీ బ్యాంకు రుణాల సర్దుబాటుకు (వడ్డీ చెల్లింపునకు) కేంద్రమే జమచేసింది. ప్లాంట్‌లో పర్మినెంట్ కార్మికులు 12500 మంది, మరో 14 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. పర్మినెంట్ కార్మికులకు 3 నెలలు, కాంట్రాక్టు వేతన జీవులకు 6 నెలలుగా జీతాలు చెల్లింపులను యాజమాన్యం నిలిపేసింది. ఆర్థికంగా బాధలు పెడితే తమ దారిలోకి తెచ్చుకుని ప్లాంట్‌ను 'ప్రైవేటు' రూటులో దారిమళ్లించే యత్నాల్లో కేంద్రంలోని బిజెపి చూస్తుందనడానికి ఇదో తార్కాణం.

జీతాలకు ఎంత కావాలి?

ప్లాంట్‌లో కార్మికుల జీతాలకు కేవలం నెలకు రూ.100 కోట్లు సరిపోతుంది. కానీ ప్రతి నెలా రూ.200 కోట్ల నుంచి రూ.300కోట్ల వరకూ జిఎస్‌టి ప్లాంట్ నుంచి వెళుతోంది. మరో రూ.80 కోట్లు కరెంట్ ఛార్జీలకు వెళ్తోంది. ప్రతి నెలా రూ.150 కోట్లు బ్యాంకు వడ్డీలు కడుతున్నారు.

ఇంత చెల్లింపులు నెలనెలా జరుపుతున్న యాజమాన్యం కార్మికులకు రూ.100 కోట్లు ఇవ్వలేని దుస్థితి నిజంగా ఉందా ? కావాలని కేంద్ర ప్రభుత్వ డైరెక్షన్‌ను అమలు చేస్తుందనడానికి నిదర్శనం కాదా ? కరెంటు బిల్లులను ఆపగల అవకాశం రాష్ట్రంలోని అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికి ఉన్నా రాష్ట్రం ఆ పని చేయకపోవడం వెనక కేంద్రం డైరెక్షన్ లేకుండా ఉంటుందా ? ఎన్నికల హామీలు గుప్పించిన టిడిపి, జనసేన కనీసం ఒకనెల కరెంట్ బిల్లులను ఆపి కార్మికుల ఆర్థిక బాధలు తీర్చడానికి ముందుకురాని ఆ నేతలు మోడీపై ఒత్తిడి తెచ్చి ప్లాంట్‌పై బిజెపి ప్రై 'వేటు' చర్యలు ఆపగలుగుతారా ? అన్న ప్రశ్నలు ఇప్పుడు అందరిలో మెదులుతున్నాయి.

వైభవ్ 'విశేష ప్రెట్' ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైభవ్ జ్యూయలర్స్ ఆధ్వర్యాన రెండు రోజులపాటు విశాఖలోని వెల్కమ్ హోటల్ డివి గ్రాండ్ బేలో తలపెట్టిన 'విశేష ప్రెట్ ప్రదర్శన, అమ్మకాన్ని సంస్థ సిఎండి భారత మల్లిక రత్నకుమారి గ్రంధి, డైరెక్టర్ కీర్తన గ్రంధి, ఎ.అలేఖ్య, కె.స్నేహ శనివారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 5 లక్షలలోపు ఇన్నెర్డ్, హ్యాండ్ క్రాఫ్ట్, క్యూరేటెడ్ డిజైనర్ డైమండ్ ఆభరణాలు, పేస్టెల్ ఆక్వా కలెక్షన్, విక్టోరియన్, గోల్డ్, ఏంటిక్, ఫ్యూజన్, సిజెడ్ డైమండ్ ఆభరణాల క్యూరేటెడ్ కలెక్షన్‌లు మునుపెన్నడూ చూడని శ్రేణిని అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శన ఆదివారం కూడా కొనసాగుతుందని,

విశేష ప్రెట్ ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో నిర్వాహకులు

వినియోగదారులు ఈ ప్రదర్శనను వీక్షించి, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వైభవ్ సంస్థ ఛైర్‌పర్సన్ గ్రంధి మల్లికా మనోజ్ కోరారు.

హెచ్ఎస్ఎల్‌లో వాల్‌చంద్ హీరా చంద్ జయంతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు వాల్‌చంద్ హీరాచంద్ 142వ జయంతిని శనివారం ఉదయం విశాఖపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ సిఎండి హేమంత్ ఖత్రి మాట్లాడుతూ సముద్ర పరిశ్రమలో నిజమైన మార్గదర్శకునిగా, భారత పారిశ్రామిక వృద్ధికి వాల్‌చంద్ హీరాచంద్ విశేష కృషి చేశారని కొనియాడారు.

కాంగ్రెస్ విజయోత్సవం

విశాఖ కలెక్టరేట్ : జార్ఖండ్ రాష్ట్రంలో ఇండియా కూటమి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తపరుస్తూ శనివారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు వర్మ రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పాత లక్ష్మీ టాకీస్ సమీపంలోగల శెట్టిబలిజ సామాజిక భవనంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వన్ టౌన్ సిఐ జి.డేముడు బాబు ముఖ్య అతిథిగా హాజరై ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్ ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జర్నలిస్టులు సామాజిక సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనడం హర్షణీయమన్నారు. శ్రీ కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం మాట్లాడుతూ అందరికి ఉపయోగపడే కార్యక్రమాన్ని జర్నలిస్టులు ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమన్నారు. వైజాగ్ ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కీర్తన్, అర్జున్‌లు మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

NARSIPATNAM MUNICIPALITY TENDER NOTICE

Narsipatnam Municipality Inviting the Follwing TENDER on 'e'-procurement Platform under Municipal General Funds

Sl. No.	Grant Name and No of Work	Tender Calling	Total Value	Downlod Starting Date & Time	Download Ending Date& Time
1.	01 Work (General Fund)	Short Tender 1st Call	Rs. 23.00 Lakhs	24-11-2024 by 11:00 AM	30-11-2024 by by 03:30 PM
2.	01 Work (General Fund)	1st Call	Rs. 3.00 Lakhs	24-11-2024 by 11:00 AM	09-12-2024 by by 03:30 PM

For details logon to: https://tender.apeprocurement.gov.in
Contacts Ph.No. 9494189575, 7702495544
Sd/- COMMISSIONER
NARSIPATNAM MUNICIPALITY

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM E.A.245/2024 in I.A.1002/2023 in O.S.264/2023

Between:
Sri Rayaprolu Srinivas ...Petitioner/Plaintiff
And:
M/s. Kumar Hospitals Private Limited, Rep. by its Managing Director Dr. Golagani Ashok Kumar ...Respondent/Defendant

NOTICE

To,**Respondent/Defendant:**
M/s. Kumar Hospitals Private Limited,
Rep. by its Managing Director Dr. Golagani Ashok Kumar, S/o. Late Rama Rao, aged 52 years, R/at. Plot No.17-A, Health City, Chinagadili, Visakhapatnam.

Please take that the above named petitioner/plaintiff filed the above E.A.245/2024 under Order 21 rule 46 C.P.C., and the same is stands posted to **10-12-2024** for your appearance either in person or through a Pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
W.V.B. RAMALINGAM,
Advocate, Visakhapatnam.

అత్యాచార నిందితులను శిక్షించాలి

నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : విశాఖ లా విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి అధ్వర్యాన శనివారం స్థానిక ఎఎంసి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భాగం లక్ష్మి మాట్లాడుతూ, ఈ తరహా ఘటనలు జరగకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రత్యేక మహిళా కోర్టులను ఏర్పాటు చేసి, దోషులకు త్వరిత గతిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు శివ, రాము, రామలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : లా విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్‌కు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, నాయకులు ప్రభావతి, వై.సత్యవతి, కె.సంతోషం వినతిపత్రం అందజేశారు. అత్యాచారం చేయడమే కాక ఆ దృశ్యాన్ని వీడియోలు తీసి అమ్మాయిని బ్లాక్ మెయిల్ చేసి నిరంతరమూ అఘాయిత్యానికి పాల్పడిన ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని పేర్కొన్నారు. ఘటన జరిగినప్పుడు హడావుడి ప్రకటనలు చేయడం, తర్వాత తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్న తీరు పలు కేసుల్లో కనపడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, ఒక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి వినతిపత్రం అందిస్తున్న ఐద్వా నాయకులు

నేరాలు ఘోరాలు

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని ఆనందపురం పంచాయతీ పరిధి పొడుగుపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. ఇంటిలో ఉన్న సుమారు రూ.3 లక్షలు, మూడు తులాల బంగారం వస్తువులు, తిండి గింజలు కాలి బూడిదయ్యాయి. పొడుగుపాలెం గ్రామానికి చెందిన బంటుపల్లి రమణ కుటుంబం పూరిపాకలో నివాసముంటుంది. శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి పూరిపాక కాలి బూడిదైంది. చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. గ్రామ రెవెన్యూ అధికారి అప్పారావు చేరుకొని ఆస్తి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. చీటీ పాడుకోగా వచ్చిన రూ.3 లక్షలు ఇంటిలో ఉన్నట్లు బాధితులు రోధిస్తున్నారు. సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక నాయకులు కోరుతున్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- గాజువాక : చోరీకి పాల్పడిన వ్యక్తిని గాజువాక క్రైమ్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... దయనగర్‌కు చెందిన దుర్గాప్రసాద్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లు కలిసి రాంగ్ రూట్‌లో వెళ్తూ, ఎదురుగా సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వచ్చే వారి నుంచి మొబైల్ చోరీలకు పాల్పడ్డారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తుచేపట్టారు. చోరీకి పాల్పడిన వీరిని పట్టుకున్నారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దుర్గాప్రసాద్‌ను రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

కోడి పందాలు శిబిరంపై దాడి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పెద గొల్లలపాలెం పంచాయితీ శివారు అమరపినివానిపాలెం గ్రామంలో ఓ మామిడితోటలో కోడిపందాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు స్థానిక సిఐ పిన్నింటి రమణ తెలిపారు. ఈ దాడిలో రెండు కోడి పుంజులు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులు కొండా పెంటయ్య, ఎ.బొర్రయ్య, వెదుళ్ల నరవకు చెందిన ఎం.సాయికిరణ్, కుర్మన్నపాలెంకు చెందిన కె.సూర్యప్రకాష్, పెదగంట్యాడకు చెందిన కె. గిరిబాబులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోళ్ల దొంగ అరెస్ట్

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట పరిసర గ్రామాలలో కోళ్ల దొంగతనం చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఎనిమిది కోళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు కొత్తకోట ఎస్సై ఎం. శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల కిత్తం పేట, మర్రివలస, టి.అర్జాపురం, దొండపూడి గ్రామాలలో వరసగా కోళ్లు దొంగతనం జరిగినట్లు తమ దృష్టికి రావడంతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. శనివారం కొత్తకోట వారపు సంతలో కోళ్లు అమ్ముతునట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేసి ఎనిమిది కోళ్లు స్వాధీనం చేసుకున్నామ న్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మత్స్యకారుల దీక్ష విరమణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇచ్చిన హామీ మేరకు రిలే నిరాహారదీక్షలను శనివారంతో విరమిస్తున్నట్లు మత్స్యకార నాయకులు గంటా నూకరాజు తెలిపారు. సమస్యలపై గత పదిరోజులుగా జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద మత్స్యకారులు రిలే నిరాహారదీక్షలు చేపట్టిన విషయం విదితమే. ఇందుకు స్పందిస్తూ మత్స్యకార ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులతో శనివారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చర్చలు జరిపారని, స్పష్టమైన హామీ ఇవ్వడంతో దీక్షలు విరమించినట్లు తెలిపారు. దీక్షలకు సహకరించిన వారందరికీ నూకరాజు ధన్యవాదాలు తెలిపారు.

గీతంలో క్రిప్టోగ్రఫీపై ఎఫ్‌డిపి

ప్రజాశక్తి -మధురవాడ : క్రిప్టోగ్రఫీ ప్రయోజనాలు, నెట్‌వర్క్ సెక్యూరిటీపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, గణిత శాస్త్ర విభాగాలు సంయుక్తంగా అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించాయి. హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ వై.వి.సుబ్బారావు హాజరై క్రిప్టోగ్రఫీ ప్రయోజనాలు, నెట్‌వర్క్ సెక్యూరిటీ నూతన అంశాలను వివరించారు. సిఎస్ఇ విభాగం డీన్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ తన ప్రసంగంలో క్రిప్టోగ్రఫీ నైపుణ్యం వివిధ రంగాలలో ఉపయోగపడుతుందని, దీనిపై అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ద్వారా క్రిప్టోగ్రఫీ, నెట్‌వర్క్ సెక్యూరిటీ అంశాల అధ్యయనంపై నిపుణులు వివరించారు. డాక్టర్ పి.చంద్రశేఖర్ సంధానకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, సిఎస్ఇ విభాగం డీన్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్, డాక్టర్ జి.లక్ష్మీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని కనమాం, కొంర్యాం పంచాయతీల్లో శనివారం నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఉపాధి హామీ పథకం డిప్యూటీ సెక్రటరీ ఆషీస్ గుప్తా, డైరెక్టర్ వైవికె.షణ్ముఖకుమార్ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో చేసిన అల్ట్రా హైడెన్సిటీ వర్క్, అమృత్సరోవర్ చెరువు, ఊట కుంటలు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ పూర్ణిమదేవి, అసిస్టెంట్ పీడీ ఆంజనేయులు, ఎంపిడిఒ డాక్టర్ జానకి, ఈపీ తిరుమలరావు, స్థానిక సర్పంచ్ ఆబోతు అప్పలరాము పాల్గొన్నారు.

క్రీడల్లో మెరిసిన విద్యార్థులకు అభినందనలు

గెలుపొందిన క్రీడాకారులతో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ: నేటి విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల్లో తమ నైపుణ్యత చాటి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా బాస్కెట్ బాల్ అధ్యక్షులు, ఎన్ఐఎఫ్ఎస్ విద్యాసంస్థల సిఇఒ సునీల్ మహంతి ఆకాంక్షించారు. మాలతాంబ విద్యానికేతన్‌లో శనివారం రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రతిభా పురస్కారాలు, మెడల్స్ ను అందుకున్న విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సునీల్ మహంతి మాట్లాడుతూ, తమ పాఠశాలలో విద్యార్థులకు జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడలలో 30మంది మాలతాంబ విద్యానికేతన్ విద్యార్థులకు 6 రాష్ట్రస్థాయి, 24 జిల్లాస్థాయి అవార్డులు అందుకున్నారని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక, చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో తమ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారని వివరించారు. మాస్టర్ ఆర్ట్స్‌లో ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ డాక్టర్ జిపిఆర్.కృష్ణ, పాఠశాల ప్రిన్సిపల్ ఎ.ఆదిమూర్తి, వైస్-ప్రిన్సిపల్ బి.శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ బి.హరీష్, పాఠశాల అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంబాల కొండను సందర్శించిన సిఎఫ్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు ఎదురుగా ఉన్న కంబాలకొండను చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సిఎఫ్) బిఎం దివాన్ మదీన్ శనివారం సందర్శించారు. అధికారులు, సిబ్బందితో కలిసి సుమారు 3.5 కిలోమీటర్లు కాలినడకన కంబాల కొండ చుట్టూ కలియ తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎకో టూరిజం అభివృద్ధిలో భాగంగా నగర వనం ఏర్పాటుకు ఉన్న అనుకూల పరిస్థితులను పరిశీలించారు. పర్యావరణానికి ఎటువంటి హాని తలపెట్టకుండా ఇక్కడకు వచ్చిన సందర్శకులకు ఆహ్లాదంతో పాటు విజ్ఞానం, ఆరోగ్యం ఇచ్చేందుకు అన్ని సౌకర్యాలు మెరుగుపరిచేందుకు తీసుకోవాలసిన జాగ్రత్తలపై ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. కంబాల కొండ పరిసరాలలో ఎటువంటి చెత్త లేకుండా, పర్యావరణానికి విఘాతం కలిగించే ఎటువంటి శాశ్వత కట్టడాలు నిర్మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పార్కులో రచ్చబండలు ఏర్పాటు చేయాలన్నారు. చెట్లపై మంచెలు నిర్మించాలన్నారు. పర్యాటకులకు అనుగుణంగా ఎడ్వంచర్ స్కిల్స్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ సందర్శనలో రేంజ్ అధికారి పివి.శాస్త్రి, సిబ్బంది శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవంతి క్యాంపస్ ఇంటర్వ్యూలో 25 మంది ఎంపిక

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 25 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎంబివి.రాజు తెలిపారు. ఎపిఎన్ ఇన్నోటెక్ కంపెనీ ప్రతినిధులు 100 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూ లు నిర్వహించగా 25 మంది ఎంపికయ్యారు. ప్లేస్‌మెంట్ అధికారి రణదీప్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవంతిలో ఎంపికైన విద్యార్థులు

ఉత్సాహంగా.. ఉల్లాసంగా...

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాఠశాల 16వ వార్షిక క్రీడా పురస్కార దినోత్సవం నిర్వహించారు. వారం రోజుల క్రితం ప్రారంభమైన ఉత్సవాలు ముగింపు రోజైన శనివారం ఆద్యంతం ఉత్సాహాన్ని నింపాయి. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక, కళాత్మక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తూ పలు పతకాలు, పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈస్ట్రన్ నేవల్ కమాండ్‌లో ఎలక్ట్రికల్ ట్రయల్స్ అండ్ మోడిఫికేషన్ యూనిట్ అధికారి కెప్టెన్ దివాకర్ శంకర్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడల్లోనే గాకుండా ఇతరత్రా రంగాల్లో కూడా ప్రావీణ్యం సంపాదించు కోవాలని సూచించారు. పాఠశాలలో సమకూర్చిన క్రీడా పరమైన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి మాట్లాడుతూ, క్రీడలు క్రమశిక్షణకు, వ్యక్తిత్వ వికాసానికి దోహద పడతాయన్నారు.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి -పద్మనాభం : రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మండలంలోని అయినాడ గ్రామపంచాయతీకి చెందిన కురిమిన లీలావతిని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ, గ్రామ సర్పంచ్‌గా, ఎంపిటిసి సభ్యునిగా, ఎంపిపిగా పనిచేశానని, తర్వాత రాష్ట్ర తెలుగుదేశం మహిళా ఉపాధ్యక్షులుగా కూడా పనిచేశానని తెలిపారు. పదవిని అప్పగించినందుకు ఎమ్మెల్యే గంటాకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

లీలావతిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

నేటి కార్మిక ప్రదర్శనను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ములగాడ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆదివారం గాజువాకలో నిర్వహించే ప్రదర్శన, సభలో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. అఖిలపక్ష కార్మికసంఘాల ఆధ్వర్యాన శనివారం హెచ్‌పిసిఎల్ లేబరు గేట్ వద్ద హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు ఎం.కృష్ణారావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం, సిఐటియు నాయుకులు కె.పెంటారావు, పూడి పైడిరాజు మాట్లాడుతూ, ఐక్యపోరాటం ద్వారా హక్కులు సాధించుకోవాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఆపాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీసవేతనం రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఆటో, ముఠా, భవన నిర్మాణ, తోపుడు బళ్ల కార్మికులకు సమగ్ర చట్టంచేయాలని, పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని, కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటుధరలు కల్పించాలని, కరెంట్ సర్దుబాటు ధరలను రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్లు ప్రతిపాదన విరమించాలని, అధికధరలను అరికట్టాలని, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గంగాధర్, నరేష్, రాజేష్, ఏసుబాబు, రాము, నాగేశ్వరరావు, ఐఎన్‌టియుసి నాయకులు తాతబాబు, నర్సింగరావు పాల్గొన్నారు.

హెచ్‌పిసిఎల్ కార్మికులనద్దేశించి మాట్లాడుతున్న ఆర్ లక్ష్మణమూర్తి

కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలి

జివిఎంసి 58, 59, 60 వార్డుల ఆఫీసు వద్ద పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి ఆధ్వర్యాన కార్మికులు సమావేశమయ్యారు. గాజువాకలో ఆదివారం నిర్వహించే ప్రదర్శన, సభను పారిశుధ్య కార్మికులు జయప్రదంచేయాలని లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, పిఎఫ్, ఇఎస్‌ఐ సక్రమంగా అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కె.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బి.రాంబాబు, డి.రాము, బి.సూరిబాబు, గంగులు తిరుపతిరావు కుమార్, దేవీలలిత, లక్ష్మి, రాజేశ్వరి, శ్యామల, రవణమ్మ, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

జోగవానిపాలెంలో పెరిగిన డయేరియా

ప్రజాశక్తి- గాజువాక : గాజువాక పరిధి జోగవానిపాలెం సాయిరాంనగర్ ఏరియాలో శనివారం నాటికి డయేరియా కేసులు పెరిగాయి. శుక్రవారం ముగ్గురు డయేరియా బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందారు. శనివారం నాటికి మరో 23 మంది డయేరియాతో బాధపడుతున్నారు. మంచినీటి పైప్ లైన్ మురుగునీటిలో ఉందని, దానిని సరిచేయాలని అనేకసార్లు జివిఎంసి వాటర్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే ఈ సంఘటన చోటు చేసుకుందని స్థానికులు వాపోతున్నారు. సాయిరాంనగర్, జోగవానిపాలేనికి వెళ్లే పైపులైన్ లీకు కావడంతో అందులో మురుగునీరు కలిసి సరఫరా అవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ విధమైన లీకులు వార్డు పరిధిలో పది చోట్ల ఉన్నాయని స్థానిక కార్పొరేటర్ చెబుతున్నారు. గాజువాక జోనల్ అధికారి శేషాద్రి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ ఘటనా స్థలానికి చేరుకొని అవసరమైన చర్యలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి బాధితులను పరామర్శించారు.

పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రియాంక

పిల్లల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెంలోని పెన్ స్కూల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు పిల్లల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రియాంక వివరించారు. వాతావరణ మార్పుల వల్ల కలిగే అనారోగ్య సమస్యలు-వాటి నివారణ, పోషకాహారం ఆవశ్యకత, జంక్ ఫుడ్ వల్ల అనర్థాలు, మొబైల్ వాడకం వల్ల కలిగే ఇబ్బందులు, కేన్సర్ కారక ఆహారాలు, పిల్లల్లో స్థూలకాయం గురించి తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలో ఉచితంగా పొందగలిగే వ్యాక్సిన్ల వివరాలను తెలియజేసారు. పిల్లల వ్యక్తిత్వ, మానసిక వికాసానికి దోహదపడేలా ఇంటిలోనే చేసుకోగలిగే చిన్న చిన్న కార్యకలాపాలను వివరించారు. తల్లిదండ్రులకున్న సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన పెన్ స్కూల్ యాజమాన్యానికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ డిమాండ్‌చేశారు. సమస్యలపై డెయిరీ గేటు వద్ద యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దీక్షలనుద్దేశించి రమణ మాట్లాడుతూ, ఎక్కడ లేని విధంగా విశాఖ డెయిరీలో తక్కువ జీతాలకు పనిచేస్తున్నామని తెలిపారు. పనికి తగ్గ వేతనం చెల్లించాలని కోరారు. రకరకాల పేర్లతో కార్మికులతో పనిచేయిస్తూ పర్మినెంట్ చేయడంలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు హాజరై దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవి.మూర్తి, ఎస్.త్రినాథ్, బి.అచ్చంనాయుడు, పైలా శ్రీనివాసరావు, వి.నారాయణమూర్తి, వై.ఈశ్వరరావు పాల్గొన్నారు.

14, 15న పెందుర్తి బాలోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి బాలోత్సవాన్ని డిసెంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించేందుకు నిర్వాహకులు నిర్ణయించారు. బాలోత్సవం నిర్వహణ గురించి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలోని పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ బాలోత్సవాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఉండే పిల్లలందరూ పాల్గొనాలనే ఉద్దేశంతో ఇక్కడ బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీని ప్రతిపాదించారు.

ఈ కమిటీకి గౌరవాధ్యక్షులుగా డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, అధ్యక్షులుగా పివి.రమణ, కార్యదర్శిగా ఎ.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా కె.విశ్వనాథ్, రాయల్ ఈవి, జాయింట్ సెక్రటరీగా ఎన్ఆర్ఐ స్కూల్ డీన్ ఎన్.రమాదేవి, కోశాధికారిగా ఉప్పాడ రాము, సభ్యులుగా అనూప్ కె.కరణ్, డాక్టర్ ఎం.నాగమణి, బి.శంకరరావు, జిఎస్.ప్రకాశరావు, బి.శేషగిరి, ఎం.శంకరరావు, జె.మహేష్, బి.సురేష్‌కుమార్ నియమితులయ్యారు.

సంపద, రాజ్యాధికారంలో వాటాకు పోరాటం

ప్రజాశక్తి-సీతమ్మధార : దేశ సంపద సృష్టికర్తలమైన మనం ఉచిత పథకాల కోసం పాకులాడకుండా సంపదలో, రాజ్యాధికారంలో న్యాయమైన వాటా కోసం పోరాడాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. శ్రామికులు శ్రమిస్తేనే సంపద పుడుతుందన్నారు. అంబానీ, అదానీలు సంపద కృష్టికర్తలు కాదన్నారు. "కులగణన-సామాజిక న్యాయం"అనే అంశంపై అంబేద్కర్ భవన్‌లో శనివారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాలకవర్గాలు అధికారం కోసం మోసాలు చేస్తూనే, మన నోరు మూయించడానికే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మనకు రావాల్సిన వాటాను పొందడం మన హక్కుగా భావించాలన్నారు. మనం సృష్టిస్తున్న సంపదలో 60 శాతం సంపన్న వర్గాలకే వెళ్లిపోతుదన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు కల్పించారని, ఆయన ఆశయాలను మనం సాధించలేకపోతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత చైతన్యవంతులై హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు.

సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, కులగణన వల్ల సామాజిక న్యాయం జరిగిందీ లేనిదీ, ఆర్థికంగా బలపడిందీ లేనిదీ తెలుస్తుందన్నారు. ప్రభుత్వ పాలనలో నష్టపోయిందెవరు, బాగుపడిందెవరో కూడా తేలుతుంది పేర్కొన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ కులగణనను వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగాలను ప్రయివేటుపరం చేయడం పెద్ద కుట్ర అని, ప్రజల జీవన స్థితిగతులు ఇంకా దిగజారే విధంగా పాలకులు పాలన సాగిస్తున్నారని తెలిపారు. యువత చైతన్యవంతులై పాలకుల విధానాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వజ్జిపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, బిజెపి పాలనలో రాజకీయ విధ్వంసం జరుగుతుందన్నారు. జనాభా ప్రాతిపదికన రావాల్సిన వాటా దక్కట్లేదన్నారు. రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు బి.కళ్యాణ్ రావు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ మాట్లాడుతూ కుల గణన జరగాలన్నారు. డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి జి.రాంబాబు, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, టి.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ, 108, 104ను పేదలకు చేరువ చేస్తా

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆరోగ్యశ్రీతో పాటు 108, 104 వాహనాల సక్రమ నిర్వహణకు గట్టి కృషి చేస్తూ వీటి సేవలను నిరుపేదలకు మరింత చెరువు చేస్తానని ఎన్‌టిఆర్ వైద్య ఆరోగ్యశాఖ చైర్మన్ సీతంరాజు సుధాకర్ చెప్పారు. ఎన్‌టిఆర్ వైద్య ఆరోగ్యశాఖ చైర్మన్‌గా మంగళగిరిలో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యం, ఆరోగ్యానికి కూటమి ప్రభత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఆరోగ్యశ్రీకి గత ప్రభుత్వం బకాయిపడ్డ నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేస్తున్నారని, ఇందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో వైద్య ఆరోగ్యంలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తామని చెప్పారు. ప్రమాణస్వీకార కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, ఎపి సిడిఎఫ్ఎల్ చైర్మన్ గండి బాబ్జి, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌ను సన్మానిస్తున్న ఎంపీ శ్రీభరత్ తదితరులు

ఏపీకి సినీ పరిశ్రమ తరలిరావాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్‌కు వీలైనంత త్వరగా సినిమా పరిశ్రమ తరలివస్తేనే కళాకారులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎపి పిల్మ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ చైర్మన్, ఉపకార్ ట్రస్టు చైర్మన్ కంచర్ల అచ్యుతరావు అన్నారు. పౌరగ్రంథాలయంలో పవన్ కల్యాణ్ కళాపీఠం ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన మెగా సంగీత విభావరి కార్యక్రమానికి అచ్యుతరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏపీకి సినీ పరిశ్రమ తరలివచ్చేలా కూటమి నేతలంతా కృషి చేయాలని కోరారు. ఉత్తరాంధ్రలో సినిమా రంగానికి సంబంధించి అపారమైన వనరులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సినీ నటులు, దర్శక నిర్మాతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గౌరవ అతిథులు 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, జనసేన డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు బొడ్డేపల్లి రఘు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, నిరంతరం ప్రజలందరినీ మెప్పిస్తున్న కళాకారులకు అనేక సమస్యలున్నాయని, వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తాము ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ కళాపీఠం గౌరవాధ్యక్షులు గెంబలి జగదీష్, అధ్యక్షులు మెరుపు వరప్రసాద్, కార్యదర్శి పీలా హరిప్రసాద్, కన్వీనర్ కె.ఇందిరా ప్రియదర్శినితో పాటు చెన్నా తిరుమలరావు, సన్ మూర్తి, ఇతర కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది.

సినర్జీస్‌కు వచ్చిన అవార్డు పత్రం

సినర్జీస్‌కు ప్రొడక్షన్ అవార్డు

ప్రజాశక్తి -ఉక్కునగరం : మోరిస్ గ్యారేజీ (యం.జి) మోటార్స్ వారి "ప్రొడక్షన్ రాంప్-అప్ అవార్డు-2024"ను దువ్వాడ విఎస్ఇజెడ్‌లోని సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్ గెలుచుకుంది. ఇటీవల గుజరాత్‌లోని హలోల్ పట్టణంలో జరిగిన కార్యక్రమంలో కంపెనీ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) డి.రమేష్‌బాబు అవార్డును అందుకున్నారు. యం.జి మోటార్స్ ఎలక్ట్రిక్ వాహనం విండ్సర్‌కు అలాయ్ వీల్స్ సరఫరా చేసినందుకుగాను సినర్జీస్‌కు ఈ అవార్డు లభించింది. దేశం మొత్తంలో ఆటోమోటివ్ పరిశ్రమలలో సాంకేతిక విలువలు, అత్యధిక నాణ్యతా ప్రమాణాలు కలిగిన వారికి మాత్రమే ఈ అవార్డు ఇస్తారు. ఈ సందర్భంగా కంపెనీలో జరిగిన ఒక కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ నయన్ చీరాల మాట్లాడుతూ, 2024లో అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ యంజి మోటార్స్ నుంచి ప్రముఖ అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇది సినర్జీన్ పనితనానికి నిదర్శనమన్నారు.

క్రమశిక్షణ అవసరం : సిఐ

ప్రజాశక్తి-పెందుర్తి : విదార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లాలంటే క్రమశిక్షణ చాలా అవసరమని పెందుర్తి సిఐ సతీష్‌కుమార్ చెప్పారు. విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో పెందుర్తి పోలీసుస్టేషన్ ఆధ్వర్యాన నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పెందుర్తి సిఐ సతీష్‌కుమార్ హాజరై మాట్లాడారు. సోషల్ మీడియాలో జరిగే మోసాలు, బెట్టింగ్ యాప్‌లు, దూమపానం, మద్యపానం, ర్యాగింగ్ తదితర విషయాలపై క్లుప్తంగా వివరించారు. వీటికి ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు.

26న దేశ వ్యాప్త ఆందోళనపై విస్తృత ప్రచారం

కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పరవాడ

కార్మిక, కర్షక, ప్రజా సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26న చేపట్టిన దేశ వ్యాప్త ఆందోళనను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పరవాడ ఫార్మాసిటీలో సిఐటియు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వానికి రైతు, కార్మికుల సమస్యలు పట్టడం లేదని, ప్రజలకు వ్యతిరేకమైన విధానాలు అమలు చేస్తుందని, కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. అదే దారిలో రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం నడుస్తోందని పేర్కొన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా అనకాపల్లి నెహ్రూ చౌక్ వద్ద జరుగు మహా ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ రైతు పండించే పంటకు కనీస మద్దతు ధర కల్పించడానికి చట్టం చేయాలని, కౌలు రైతులకు యజమాని సంతకం లేకుండా గుర్తింపు కార్డులు, రుణ సౌకర్యం కల్పించాలని, 50 ఏళ్లు నిండిన రైతులకు, వ్యవసాయ కార్మికులకు ప్రతినెల రూ.10వేలు పించను ఇవ్వాలని, కేరళ వామపక్ష ప్రభుత్వం తరహా దేశవ్యాప్తంగా రుణం విమోచన చట్టం తేవాలని, విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాలు ధర వెంటనే పెంచాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, నాయకులు గుమ్మాల శివచలం, బి నాగరాజు, పి ప్రసాద్ పాల్గొన్నారు.

చోడవరం : ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్వి నాయుడు డిమాండ్ చేశారు. శనివారం నరసయ్యపేట గ్రామంలో ముఠా కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెక్కల కష్టంపై ఆధారపడిన ముఠా కార్మికులకు ఎటువంటి చట్టాల అమలు కావడం లేదని, వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నెల 26వ తేదీన అనకాపల్లిలో ర్యాలీ సభ జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుల పి.చంద్రశేఖర్, కార్మికులు అప్పలనాయుడు, కృష్ణ, రామునాయుడు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఈనెల 26న అనకాపల్లిలో జరిగే మహాధర్నాకు అధిక సంఖ్యలో తరలి రావాలని సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు పిలుపునిచ్చారు. అచ్యుతాపురం సిఐటియు కార్యాలయంలో మండల కమిటీ ప్రతినిధి బి జయ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో సోమునాయుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ, కార్మిక, కర్షకులు, ప్రజలపై భారాలు వేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఆర్ రాము, మంగ లావణ్య, రమణ, శ్రీరాములు, మణి పాల్గొన్నారు.

సిఐటియు బైకు ర్యాలీ

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 26న అఖిలపక్ష కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో దొండపర్తి రైల్వే డిఆర్ఎం ఆఫీస్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు జరిగే కార్మిక ప్రదర్శన, అనంతరం జరిగే సభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. రామ్‌నగర్, జిల్లా కోర్టు, జగదాంబ వాచ్‌హౌస్ జంక్షన్, పూర్ణా మార్కెట్, కొత్త రోడ్ మీదుగా తిరిగి సరస్వతీ పార్కు, డాబాగార్డెన్స్, అంబేద్కర్ విగ్రహం, ఎల్ఐసి, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలుమెట్ట మీదుగా తిరిగి జివిఎంసి వద్దకు ఈ ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 29న విశాఖ పర్యటనకు వస్తున్న సందర్భంగా విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేటీకరణ చేయడం లేదని స్పష్టంగా ప్రకటించాలన్నారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు చెప్పాలన్నారు. ఈ ప్రకటన చేయకపోతే ఆయన ఆంధ్ర రాష్ట్రానికి, తెలుగు ప్రజలకు తీరని ద్రోహం చేసినట్లేనన్నారు. మోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికవర్గం, రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకూ భారీ కార్మిక ప్రదర్శన, అనంతరం సభ జరుగుతాయని, ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎఫ్‌టియు కార్యదర్శి దేవా, సిఐటియు నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, పి.వెంకట్‌రెడ్డి, జి.అప్పలరాజు, పి.వెంకట్రావు, ఉరుకూటి రాజు, టి.నూకరాజు, ఎ.సింహాచలం, వి.కృష్ణారావు, ఎ.అప్పారావు, కె.కుమారి పాల్గొన్నారు.

విశాఖపట్నంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పోలీసు గ్రీవెన్స్‌లో సమస్యలు వింటున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం పోలీస్ గ్రీవెన్స్ డే సందర్భంగా సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

79వ వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పరవాడ : జివిఎంసి 79వ వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ తెలిపారు. వార్డులోని దేశపాత్రునిపాలెం పరిధి జాజులవానిపాలెం, శ్రీనివాసనగర్, దేశపాత్రునిపాలెం, ఎస్సీ కాలనీ, సాయి నగర్ కాలనీ, అశోక్ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన ప్రతి వీధి తిరిగి రోడ్లు, కాలువలు ఎక్కడ అవసరమో గుర్తించి పబ్లిక్ వర్క్స్ అధికారులతో అంచనాలు తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తయారు చేసిన అంచనాలన్నీ జివిఎంసి కమిషనర్‌కి, స్థానిక శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు దృష్టికి తీసుకువెళ్లి పనులు పూర్తయ్యేలా చూస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పబ్లిక్ వర్క్స్, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, శానిటరీ సిబ్బంది. పాల్గొన్నారు.

జగన్ అవినీతి సప్త సముద్రాలు దాటింది

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అవినీతి సప్త సముద్రాలు దాటిందని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అన్యాయం, ఆశ్రిత పక్షపాతం, అవకాశవాదం, అధికార దాహం, అహంకారం జగన్ రెడ్డికి పంచప్రాణాలని, అవినీతి ఆరో ప్రాణమని ఎద్దేవా చేశారు. జనం పొట్ట కొట్టి తన కడుపు నింపుకోవడంలో ఆరితేరిన జగన్ అంతూపొంతూ లేని అక్రమార్జనతో యావత్ భారతదేశానికి తలవంపులు తీసుకొచ్చారని విమర్శించారు. విద్యుత్ ఒప్పందాల మధ్యన 1750 కోట్లు మేసిన జగన్ లంచావతారం విశ్వరూపాన్ని అమెరికా దర్యాప్తు సంస్థ వెలుగులోకి తెచ్చిందన్నారు. ఇప్పటికే జగన్ రెడ్డి అవినీతి వల్ల విద్యుత్ వినియోగదారులపై తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచారని నాగ జగదీష్ వెల్లడించారు.

అనాథాశ్రమ పిల్లలకు భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : చోడవరంలోని అనాధాశ్రమంలో గల 60 మంది పిల్లలకు మండల కేంద్రం పాల సెంటర్‌లో అయ్యప్ప స్వామి పీఠం భక్తులు శనివారం భోజనం సమకూర్చారు. ఆకలితో ఉన్న వారిని ఆదుకోవడమే భక్తి మార్గమని గురుస్వామి పి సత్యనారాయణ తెలిపారు.

జనసేన నేత రాంకీకి సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం శ్రీసత్యనారాయణ స్వామి దేవస్థానం ఛైర్మన్ బొడ్డేడ మురళి మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో 80వ వార్డు అధ్యక్షులు బిఎస్ఎంకె జోగినాయుడు, దేవస్థానం పాలకమండలి సభ్యులు పెంటకోట చంద్రరావు, మారిశెట్టి భాస్కరరావు, శ్రీకాకుళం గణపతి, సూరిశెట్టి మల్లమ్మ, దొడ్డి భరత్ పాల్గొన్నారు.

రాంకీకి జ్ఞాపిక అందజేస్తున్న బొడ్డేడ మురళి తదితరులు

వడ్డాదిలో ఆగని ఎక్స్‌ప్రెస్ బస్సులు

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే బుచ్చయ్యపేట మండలం వడ్డాది జంక్షన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలుపుదల చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాడేరు, చోడవరం, విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులను వడ్డాది జంక్షన్‌లో నిలుపుదల చేయడం లేదని వాపోతున్నారు. పాడేరు, ఘాట్ రోడ్డు, చోడవరం, విశాఖపట్నం స్టాప్‌ల్లో మాత్రమే ఈ బస్సులు ఆగుతున్నాయి. అయితే ఇటు నర్సీపట్నం వచ్చే వారు పాడేరు వెళ్లాలన్నా, బుచ్చయ్యపేట, రావికమతం మండలాల వారు అటు విశాఖపట్నం, ఇటు పాడేరు వెళ్లాలన్నా వడ్డది జంక్షన్ మీదుగానే వెళ్లారుం. వడ్డాది సమీపంలోని పలు గ్రామాల నుండి నిత్యం అధిక సంఖ్యలో వ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు విశాఖపట్నం రాకపోకలు చేస్తుంటారు. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపకుండా వెళ్ళిపోతుండడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసి అధికారులు ప్రయాణికులు అవసరాలను దృష్టిలో ఉంచుకొని వడ్డాది జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలుపుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

8న మాలల గర్జనను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : విశాఖపట్నం గురజాడ కళాక్షేత్రంలో డిసెంబర్ 8న జరగనున్న ఉత్తరాంధ్ర మాలల గర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలిండియా దళిత ఫోరం స్టేట్ సెక్రటరీ జి.జగజ్జీవన్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని సాయి నగర్ ఎస్సీ కాలనీలో పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ మచ్చ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ నాయకులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొంతమంది స్వార్ధ పూరిత రాజకీయ మతోన్మాదంతో వర్గీకరణ పేరట మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో దళిత నాయకులు యు.వేణుగోపాలరావు, సబ్బవరం సర్పంచ్ డి.ప్రసాదరావు, కైకాల సన్యాసిరావు, ఎన్.కోటేశ్వరరావు, ముదపాక అప్పారావు, పొట్ల కృష్ణ, జి.కోటి, దొమ్మి ఈశ్వరరావు, రామారావు, పి.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటకు కొత్త రకం పురుగు

- కంకులను కొరికేస్తున్న రెల్ల రాల్చు

- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ఆశాజనకంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్న సమయంలోనే ఎప్పుడు లేని విధంగా కొత్త రకం పురుగు వరి చేనుకు తీవ్ర నష్టం చేకూర్చుతుంది. పంట చేతికొచ్చే సమయంలో రెల్ల రాల్చు అనే పురుగు వరి కంకులను కత్తిరిస్తుండడంతో ధాన్యం బల్లున పొలంలో రాలిపోతున్నాయి. ఈ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరి చేనుకు గతం కన్నా తక్కువగానే తెగుళ్ల సోకాయి. దీంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. తక్కువ పెట్టుబడితో పరిచేను పండిందని ఆనందపడగా.. ఇంతలోనే రెల్ల రాల్చు అనే కొత్త రకం పురుగు సోకింది. ఈ పురుగు అన్ని రకాల వరి చేనుకు సోకగా, ఆర్‌జిఎల్ రకం వరిలో కొంచెం ఎక్కువగా వుంది. పది రోజుల్లో కోతలు అవుతాయని అనుకుంటున్న సమయంలో వరి కంకులను కొరికే పురుగు సోకి వరి చేనుకు ఉన్న గుత్తులను కత్తిరిస్తున్నాయి. దీంతో వరి చేను ఉండగానే గింజలన్నీ మడిలోనే రాలిపోతున్నాయి. దీనిని చూసిన రైతులు ఒకసారిగా ఆందోళనకు గురవుతున్నారు. చేతికి వచ్చే పంట నేలపాలు అవ్వడంపై రైతులు నత్తీనోరు కొట్టుకుంటున్నారు. ఎప్పుడు లేని ఈ కొత్తరకం పురుగు సోకడంతో రైతులు ముమ్మరంగా మందులు పిచికారీ చేస్తున్నారు. మండలంలోని రైతులు 50 శాతం వరకు ఆర్‌జిఎల్ వరిని సాగు చేస్తున్నారు. ఈ వరి పంట అన్ని రకాల ఉపయోగకరంగా ఉంటుంది. ప్రజలు తినడానికి ధాన్యం, పశువులకు వరిగడ్డి కూడా ఎక్కువగా ఉండడంతో ఈ రకం వరిపై రైతులు మక్కువ చూపుతున్నారు. ఇప్పటికే తేలిక రకము వరి కోసి కుప్పలు కూడా వేయడం జరిగింది. దీర్ఘకాలకు పంట అయిన ఆర్‌జిఎల్, అమరావతి మరికొన్ని రకాలు మాత్రం కోతల కోయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ సమయంలో రెల్ల రాల్చు పురుగు సోకి పంటకు తీవ్ర నష్టం చేకూర్చడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేలరాలిన వరి కంకులు

నివారణకు మందులు పిచికారీ చేయాలి

మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటించి రెల్ల రాల్చు పురుగు సోకిన ఆర్‌జిఎల్ పంటలను పరిశీలించడం జరిగింది. రైతులు ఆందోళన చెందనవసరం లేదు. రెల్ల రాల్చు పురుగు నివారణకు గింజ గట్టిపడిన దశలో ఉన్న పంటకు పర్మెత్రిన్ మందు ఎకరాకు 400 మిల్లి లీటర్లు, చేను పచ్చగా ఉన్న దశలో ఎకరాకు బైఫెంత్రిన్ 500 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలి. అలాగే క్లోరాంత్రినిలిప్రోల్ (కొరాజెన్) 60 మిల్లీ లీటర్లు, ఇండాక్సాకార్బ్ 200 మిల్లీలీటర్లు, ఐసోసైక్లోసిరం 18.1 శాతం ఎస్‌సి 150 మిల్లీలీటర్లు మందులు కూడా ఎకరాకు చొప్పున సరిపడా నీటితో పిచికారీ చేయవచ్చు.

- సోమశేఖర్, మండల వ్యవసాయ అధికారి

ప్రభుత్వ పాఠశాలల పనివేళల మార్పు సరికాదు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి

ప్రమాణ స్వీకారం చేస్తున్న యుటిఎఫ్ అచ్యుతాపురం మండల కార్యవర్గం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ప్రభుత్వ పాఠశాలల పని వేళలు మార్పు ప్రతిపాదనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి శ్రీలక్ష్మి అన్నారు. ఏపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మద్దిల నానాజీ, కాకిలేటి సుభాషినిదేవి ఆధ్వర్యంలో అచ్యుతాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ మండల కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు.

మండల కమిటీ ఎన్నిక

అనంతరం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి చిన్నబ్బాయి సమక్షంలో మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులుగా కొంకి మహిమారావు, అధ్యక్షులుగా మద్దిల నానాజీ, ప్రధాన కార్యదర్శిగా కాకిలేటి సుభాషినిదేవి, ఉపాధ్యక్షులుగా ఆర్.రవికుమార్, మాత సూర్యలక్ష్మి, సిపిఎస్ కన్వీనర్‌గా ఈ.అరుణకుమారి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ నాయకులు జిఎస్ ప్రకాష్, వి జాషువా, ఎన్ కళ్యాణ్‌రావు, కె మురళీకృష్ణ, నీరజ, పారిజాతం, రూన్సీ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ సబ్బవరం మండల కమిటీ ఎన్నిక

సబ్బవరం : యుటిఎఫ్ సబ్బవరం మండల శాఖ కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "అధ్యయనం, అధ్యాపనం- సామాజిక స్పృహ" లక్ష్యాలుగా నిరంతరం కృషి చేస్తున్న యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేస్తుందని చెప్పారు. 24వ తేదిన అనకాపల్లిలో జరుగుతున్న జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యుటిఎఫ్ సబ్బవరం మండల కమిటీ ఎన్నిక జరిగింది. యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులుగా పి.తమ్మారావు, అధ్యక్షులుగా బి.నాగరాజు, సహాధ్యక్షులుగా యు.స్వర్ణలత, ప్రధాన కార్యదర్శిగా కొరుపోలు వెంకటరమణ, కోశాధికారిగా ఎస్.కె.అజారుద్దీన్, ఉపాధ్యక్షులుగా త్రివేణి, కార్యదర్శులుగా కె.భాస్కరరావు, భీమేశ్వరి దేవి, వెంకట రెడ్డి, ఎ.ఆశాజ్యోతి ఎన్నికయ్యారు. ఎన్నిక పరిశీలకులుగా యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్.భాస్కరరావు వ్యవహరించారు.

యుటిఎఫ్ సబ్బవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

100 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండల కేంద్రంలోని చెరకు కాటా వద్ద శుక్రవారం స్థానిక ఎస్‌ఐ ఎ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా 100 కేజీలు గంజాయి పట్టుబడింది. ఈ మేరకు అనకాపల్లి డిఎస్‌పి ఎం.శ్రావణి శనివారం బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం... ముందస్తుగా అందిన సమాచారం మేరకు బుచ్చయ్యపేట చెరుకు కాటా వద్ద స్థానిక ఎస్‌ఐ తన సిబ్బందితో శనివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో వేగంగా వస్తున్న కారును తనిఖీ చేయగా అందులో గల ముగ్గురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ముగ్గురిని పట్టుకొని, కారులో అక్రమంగా తరలిస్తున్న 100 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పచ్చగా వారికి రిమాండ్ విధించినట్లు డిఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సిఐ కోటేశ్వరరావు, ఎస్ ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భరణికాన కుటుంబానికి బాబ్జి పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి భరణికాన సాయినాధరావు చిన్న కుమారుడు గురువారం మృతి చెందగా, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎపి కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గండి బాబ్జి శనివారం సాయినాధరావు ఇంటికి వచ్చిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భరణికానను పరామర్శించిన వారిలో సబ్బవరం సిఐ పిన్నింటి రమణ, మాజీ ఎంపిపి గండి దేముడు, పల్లా తాతారావు, పడాల వెంకటరమణ, కొరుపోలు గోవింద, బంధం వెంకటరమణ, అంగటి నానాజీ ఉన్నారు.

సోలార్ విద్యుత్ వినియోగించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా ప్రతి ఒక్కరు సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలని ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. మండల కేంద్రం రెల్లి వీధిలో శనివారం ఉచిత సోలార్ పథకం పై అవగాహన కలిగించారు. దళిత కాలనీలో ఉన్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం సంత బయలు వద్ద స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రం శెట్టి భవాని, విద్యుత్ ఎఇ చంద్రశేఖర్, గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్‌తో దుష్ప్రభావాలు

ప్రజాశక్తి -అనకాపల్లి : పశువులకు వైద్యం చేయడంలో ఉపయోగించే యాంటీ బయోటిక్స్ వల్ల అనేక దుష్ప్రభావాలు ఏర్పడుతున్నాయని కొప్పాక పశువైద్యురాలు జిబి శ్యామల పేర్కొన్నారు. మండలంలోని బట్లపూడి పాల ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో శనివారం గ్రామ సర్పంచ్ గొంతిన సత్యారావు అధ్యక్షతన యాంటీబయోటిక్ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైతేనే మందుల వాడకం, స్వచ్ఛమైన పర్యావరణం, వ్యాధి నిరోధకత పెంచడానికి వ్యాక్సినేషన్ల ఉపయోగాలు తెలియజేశారు. ఈనెల 20 నుంచి డిసెంబర్ 19 వరకు నాలుగు నుంచి 8 నెలల వయసు గల ఆడ పెయ్యిలకు బ్రూసెల్లా వ్యాక్సినేషన్ జరుగుతుందని చెప్పారు. సెన్సస్, ఎస్ఎస్ ఎస్‌టి, ఉపాధి హామీ పథకం, గడ్డి పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పశు వైద్యురాలు జిబి.శ్యామల

దుకాణాలు, ఇంటి అద్దెలపై

18 శాతం జిఎస్‌టి వసూలును కూటమి ప్రశ్నించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : దుకాణాలు, ఇల్లు అద్దెలపై 18 శాతం జిఎస్‌టి వసూలుపై పార్లమెంటులో రాష్ట్రంలోని టిడిపి కూటమి నాయకులు ప్రశ్నించాలని ఉత్తరాంధ్ర చర్చ వేదిక సభ్యులు బుద్ద రాజేష్ కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కమర్షియల్ షాపుల మీద, హౌస్ రెంట్ల మీద కేంద్ర ప్రభుత్వం 18శాతం జిఎస్టి వసూలు చేయడాన్ని పునరాలోచించాలని కోరారు. ఇది బడా కార్పొరేట్ సంస్థల షాపింగ్ మాల్స్‌కి సహకరించే విధంగా ఉందన్నారు. మధ్యతరగతి, చిరు వ్యాపారస్తులపై తీవ్ర ప్రభావం చూపి వారి వ్యాపారాలు మూసుకొని కూలీ పనికి వెళ్లే దుస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. జీఎస్టీ కేంద్ర ప్రభుత్వం పక్షపాత వైఖరితో దక్షిణ భారత దేశంలోనే ఎక్కువ వసూలు చేస్తుందన్నారు. ఏడాదికి రూ.1000 కోట్లు టార్గెట్ పెట్టి 18శాతం జిఎస్టి వసూలు చేయాలని రాష్ట్రాల జిఎస్టి అధికారులకు హుకుం జారీ చేయడం చాలా బాధాకరమన్నారు. దీనిపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల పార్లమెంటు సభ్యులు ప్రశ్నించాలన్నారు. దీనివలన నష్టపోయేది సామాన్య ప్రజలేనని, త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి 18శాతం జిఎస్టి అమలు పరచకుండా చూడాలని కోరారు.

మాట్లాడుతున్న బుద్ద రాజేష్

ఘనంగా ఎన్‌సిసి దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ఎన్‌సిసి దినోత్సవం ఘనంగా జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల అధ్యక్షుడు కేజే సౌరభ్ మాట్లాడుతూ దేశంలోని యువత కర్తవ్యం, క్రమశిక్షణ, సాహస స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, ఇందుకు ఎన్‌సిసి దోహదపడుతుందని తెలిపారు. కెప్టెన్ ధర్మ లింగం మాట్లాడుతూ దేశ పురోగతికి నాయకత్వం వహించే సమర్థులైన పౌరులుగా తీర్చిదిద్దడానికి ఎన్సీసీ మంచి అవకాశమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కే శ్రీధర్ మాట్లాడుతూ ఎన్సిసి క్యాడెట్లు తరచు విపత్తు ఉపశమనం కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రాజెక్టులలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్సిసి నేవీ లెఫ్టినెంట్ ఎంజె రాజ్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె రమణ, అధ్యాపకులు కె సీతారాం, వై కిరణ్ కుమార్, కె మల్లికార్జునరావు, పి నర్సింగరావు, రూప, ఎన్‌సిసి ఆర్మీ, నేవీ క్యాడెట్లు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో శతకం పట్టు రామకోవులు వద్ద గల గౌరీ పరమేశ్వరుల నిమజ్జన కార్యక్రమంలో భాగంగా శనివారం సారె ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి తమకు తోచిన పిండి వంటలు తయారు చేసి మహిళలు వాటిని తీసుకొని డప్పులు, మేళాలు చిడతలు మధ్య గ్రామమంతా ఊరేగించారు. ఎడ్ల బండ్లు అలంకరణ చేసి వాటిని కూడా ఈ ఊరేగింపు కార్యక్రమంలో భాగం చేశారు. ఈ కార్యక్రమంలో సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, వార్డు మెంబరు తనకల పట్టాలు, ఆకుల సాయి ప్రసాదు, కుమార ఎర్రు నాయుడు, కండక్టర్ సిన్ని వెంకట అప్పలస్వామి నాయుడు, కుంచ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-యలమంచిలి : గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రతిభ కనబరచిన యలమంచిలి కొత్తపేట హైస్కూల్ విద్యార్థుల్ని శనివారం అభినందించారు. వారోత్సవాల్లో భాగంగా డ్రాయింగ్, చెస్, వక్తృత్వ, పాటల పోటీల్లో తమ పాఠశాలకు చెందిన సుమారు 15 మంది విద్యార్థులు పాల్గొని గెలుపొందారని పాఠశాల డ్రాయింగ్ టీచర్ రాజేశ్వరి తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి వెలికి తీయడానికి పాఠశాలలు, గ్రంథాలయాల్లో జరిగే ఇలాంటి పోటీలు ఎంతో దోహద పడతాయని ఆమె అభిప్రాయపడ్డారు. వ్యక్తిత్వ వికాసం కొరకు ఇటువంటి పోటీలు నిత్యం పాఠశాలల్లో జరగాలని హైస్కూలు ప్రధానోపాధ్యాయులు వై.వి.రమణ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ, రాజేశ్వరి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న మలసాల కుమార్ రాజా

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కుమార్ రాజా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి కొత్తూరు నర్సింగరావు పేట సిరసపల్లి గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి అలివేలు మంగమ్మ ఆలయంలో శనివారం కార్తీకమాసం సందర్భంగా స్వామి వారిని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ సోదరుడు కుమార్ రాజా దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో కుమార్ రాజాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి 84వ వార్డ్ ఇంచార్జ్ కొరుకొండ రాఘవ, బలిరెడ్డి హరి శివ బ్రహ్మ, ఈగల మహేష్, కరణం సురేష్, పొట్నూరు నాగేంద్ర, శేఖర్ మంత్ర రంగ, కేబుల్ శ్రీను, బలిరెడ్డి శ్రీకాంత్, దాడి కుమార్, శిరసపల్లి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు బుచ్చయ్యపేట పీహెచ్సి 108 సిబ్బంది, ఈఎంటి ప్రవీణ్ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 3.45 నుండి 4 గంటల వరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 108 సర్వీసును నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని, గవర్నమెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈనెల 25 నుండి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో 108 వెహికల్ డ్రైవరు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన తాతయ్యబాబు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఏపి హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రజాదర్బార్లో స్వీకరించిన వినతులు త్వరగా పరిష్కారం కోసం కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

మంగళగిరి టిడిపి ఆఫీసులో వినతులు స్వీకరిస్తున్న తాతయ్యబాబు

కానరాని 'మన ఇల్లు - మన గౌరవం'

ప్రజాశక్తి -కోటవురట్ల: కూటమి ప్రభుత్వం ఇటీవల చేపట్టిన 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమం మండల వ్యాప్తంగా సెప్టెంబర్ నెలలో అట్టహాసంగా నిర్వహించారు. గ్రామాలకు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు. మండల వ్యాప్తంగా గత వైసిపి ప్రభుత్వంలో 2039 జగనన్న ఇల్లు మంజూరు కాగా ఇంతవరకు పూర్తయిన ఇల్లు 887, నేటికీ మొదలు పెట్టిన ఇల్లు 490 వరకు ఉన్నట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ సమయంలో 43 లేఔట్లు ఏర్పాటు చేయగా 11 లేఔట్లు ఆర్ సి పాలెం, రాజుపేట, లింగాపురం, పందూరు, తంగేడు, వెంకటాపురం 2, తిమ్మాపురం 2, బికేపల్లిలో క్యాన్సిల్ చేసినట్లు వెల్లడించారు.

మండల వ్యాప్తంగా గత ప్రభుత్వంలో ఐదు గ్రామాలలో కోటి 75 లక్షల రూపాయలతో స్థలాలు కొనుగోలు చేశారు. పాములవాక, అన్నవరం, జల్లూరు, గొట్టువాడ, కోటవరట్ల గ్రామాలలో జగనన్న కాలనీకి నాడు వైసిపి ప్రభుత్వం కొనుగోలు చేసింది. అన్నవరంలో 1.30 ఎకరాల్లో 52 మంది లబ్ధిదారులకు కేటాయించగా ఆ ప్రదేశంలో ఒక్కరు కూడా ఇల్లు నిర్మాణం చేపట్టలేదు. జల్లూరు గ్రామంలో 0.50 ఎకరాల స్థలాన్ని 22 మంది లబ్ధిదారులకు కేటాయించినా ఇక్కడా కూడా ఎవరు నిర్మాణాలు చేపట్టకపోవడం విశేషం.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మన ఇల్లు మన గౌరవం పేరుతో గృహ నిర్మాణ శాఖకు 174 ఇల్లు నిర్మాణం లక్ష్యం చేసుకోగా కేవలం 46 ఇల్లు మొదలెట్టినట్లు తెలిపారు. మంజూరైన లేఔట్లలో మన ఇల్లు మన గౌరవం పేరుతో ఒక ఇల్లు కూడా మొదలు పెట్టకపోవడం విశేషం. సిబ్బంది కొరత వేధిస్తున్నట్లు తెలిసింది. గతంలో 19 సచివాలయాలకు గాను ఎనిమిది మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉండేవారు. ప్రస్తుతం ఐదు మంది మాత్రమే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉండడంతో సిబ్బంది కొరత స్పష్టంగా కనిపిస్తుంది. కొన్ని గ్రామాలలో మంజూరైన లేఅవుట్లు అనుకూల ప్రదేశం కాకపోవడంతో సొంతంగా స్థలాలు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టుకుంటున్నారు. నాటి ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను కొన్ని లేవట్లలో మంజూరైన లబ్ధిదారులు

సమీక్షిస్తున్న అధికారులు (ఫైల్ పాటో)

రిటర్న్ ఇచ్చారు. ఎంపిక చేసిన లేఔట్లలో కొన్ని ప్రభుత్వం జురాయితి భూమిని కొనుగోలు చేసినా అది కూడా వృధాగా దర్శనమిస్తూ అసాంఘిక కార్యక్రమాలకి అడ్డాగా తయారైంది. భూమి లెవెలింగ్, రోడ్డు నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యానికి లక్షల రూపాయలు నాటి ప్రభుత్వంలో ఖర్చు చేసారు, ఇప్పటికైనా అధికారులు గుర్తించి నివాసయోగ్యమైన ఇళ్ల స్థలాలను మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని ఆయా ప్రాంత వాసులు కోరుకుంటున్నారు.

ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి

సబ్ జైలును తనిఖీ చేసిన సివిల్ జడ్జి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక సబ్ జైల్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, సివిల్ జడ్జ షియాజ్ ఖాన్ శనివారం సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. న్యాయ వాదులను పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని వారు ఎవరైనా ఉంటే మండల లీగల్ సర్వీసెస్ ద్వారా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని, న్యాయ సహాయం చేస్తామన్నారు. సబ్ జైల్లో పరిసరాలను పరిశీలించారు. అనంతరం సమీపంలో పాత న్యాయస్థానం భవనాన్ని, న్యాయాధికార నివాస సముదాయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పానెల్ అడ్వకేట్ గోవిందు, జైల్ విసిటింగ్ లాయర్ ఎం గోవర్ధనగిరి, అడ్వకేట్లు ఆనంద్, సూరిబాబు, కామిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

తూర్పు కాపు సంక్షేమ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -రావికమతం: రావికమతం మండల తూర్పు కాపు సంక్షేమ సంఘం నూతన అధ్యక్షునిగా రావికమతం గ్రామానికి చెందిన గంజి మోది నాయుడు 45 ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య ఎన్నికల అధికారిగా హాజరైన అనకాపల్లి జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు కరణం శ్రీహరి ఆధ్వర్యంలో రావికమతం సర్పంచ్ గంజి మోది నాయుడును మండలం తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఇందుకు సభ్యులు అ ందరూ సహకరించాలని కోరారు. కార్యవర్గ సభ్యులుగా కాసెట్టి రాజు, గొర్లె దేవుళ్ళు, గొర్లె శ్రీను, సీత అప్పారావు, అప్పారావు, పిల్ల గోవిందా, ఇందల శివ, కలగా రఘు, పి .శ్రీను, వజ్రపు ప్రసాదులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తూర్పు కాపు సభ్యులు పాల్గొన్నారు.



గంజి మోది నాయుడు

పంచాయతీ నిధులతో రోడ్ల నిర్మాణం

పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ సుజాత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం మేజర్ పంచాయతీలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం జరుగుతున్న సీసీ రోడ్లను శనివారం సర్పంచ్ లోచల సుజాత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ద్వారా 75శాతం సీపీ రోడ్లు పూర్తిచేయగా, మిగిలిన 25 శాతం గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకొని అత్యవసమైన చోట పరిశీలించి పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మామిడి కృష్ణ, ప్రసాద్, కుండల పెదబాబు, భర్నికల రమణ పాల్గొన్నారు.

కవగుంటలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కార్యదర్శి

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-రావికమతం: డ్రై డేలో భాగంగా కవగుంట గ్రామంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టామని సర్పంచ్ దాసరి సూర్యకుమారి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కవగుంట గ్రామపంచాయతీకి నూతన కార్యదర్శి కొర్ర రాజబాబు నియామకం అయ్యారన్నారు. కార్యదర్శి సహకారంతో మరింత మెరుగ్గా గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజబాబు పాల్గొన్నారు.

గొలుగొండ: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్లో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. రోడ్లకు ఇరువైపులా తుప్పలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మండల పరిపాలనాధికారి బి.సత్యనారాయ, ఏపిఎం కరుణానిధి, ఈఓపిఆర్డి శ్రీనివాస్, ఐసిడిఎస్ సీడీపీఓ శ్రీగౌరి పాల్గొన్నారు.

యలమంచిలి: మాస్ క్లీన్లీనెస్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా యలమంచిలి ఫైర్ ఆఫీస్ కాలనీ, అంగన్వాడీ కేంద్రం వద్ద శనివారం మున్సిపల్ సిబ్బంది, స్థానికులు చెత్తను తొలగించారు.ఫైర్ ఆఫీసు, మార్చురీ పరిసరాల్లో తుప్పలను తొలగించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇనస్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం పట్టణంలో అధికారులు పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీపీ గాడి కాసు తదితరులు స్వయంగా పారిశుధ్య పరికరాలు చేతపట్టి కాలువలు, డ్రైనేజీల్లో శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డి మహేష్, స్థానిక సర్పంచ్ నూకాలమ్మ, పంచాయతీ ఈవో నారాయణరావు, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి, రైవాడ గ్రామాలను మండల స్థాయి అధికారులు పరిసరాలను శుభ్రపరిచారు. కెజిబివిని, రైవాడ కాలనీ వద్ద డ్రైనేజీ వాటర్ పొలాల్లో వెళ్లడం వలన ఇబ్బందులు గురైన రైతు పిర్యాదు మేరకు ఎంపీడీవో ఎంవి సువర్ణరాజు పరిశీలించారు. సర్పంచ్ చల్లా లక్ష్మి నాయుడు, మాజీ సర్పంచ్ చల్లా తాతీయ్యలు, ఏఈ చంద్రశేఖర్, కెజిబివి ప్రిన్సిపాల్ భువన మాధురి, పంచాయతీ కార్యదర్శి జామి అప్పారావు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ విపివి త్రినాథ్, ఎన్ఆర్ఈజీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శనివారం స్వేచ్ఛతా హీ సేవా కార్యక్రమం జరిగింది. హైస్కూల్లో పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఏపీవో శ్రీనివాసు, ఇఒపిఆర్డి వెంకటలక్ష్మి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సత్యారావు, సచివాలయ పోలీస్ గీత, డిజిటల్ అసిస్టెంట్ హరిణి, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయిబాబా జయంతి సందర్భంగా..

పేదలకు దుప్పట్ల పంపిణీ

నర్సీపట్నంలో దుప్పట్లను ఇస్తున్న సమితి సభ్యులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: సత్యసాయిబాబా జయంతి సందర్భంగా స్థానిక సాయి నగర్లో సత్యసాయి మందిరంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేసినట్లు సత్యసాయి సేవా సంస్థ సభ్యులు తెలిపారు. నిరుపేదలకు వస్త్ర దానం చేశారు. ఈ కార్యక్రమంలో సాయి సేవకులు పెద్దలు మహిళలు భక్తులు, సత్యసాయి సేవ సమితి కన్వీనర్ ఉపాధ్యాయులు రామకృష్ణ పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో శ్రీసత్యసాయిబాబా జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది నిరుపేద వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్, ఏఎల్ పురం సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కొంగసింగి గ్రామంలో 18 మంది పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వాసుదేవర, గ్రామ సర్పంచ్ వరహాలబాబు, ఉప సర్పంచ్ రమణబాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు: శ్రీసత్య సాయిబాబా 99వ జయంతి వేడుకలు శనివారం మండలంలోని కూంద్రపువానిపాలెంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పివిజి.కుమార్ సాయి పతాకవిష్కరణ, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సత్యసాయి బోధించిన ప్రేమ, సేవ, శాంతి, సత్యం ధర్మం వంటి ఆధ్యాత్మిక సూత్రాలు అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ఆర్.మహేష్, కశిరెడ్డి అప్పలనాయుడు, కన్నూరు అప్పలనాయుడు, కన్నూరు సూర్యనారాయణ, కన్నూరు చెల్లుబాబు, చల్లా సత్యనారాయణమూర్తి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక నిదానం దొడ్డి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాబా 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావును సేవా సమితి కన్వీనర్ కెవి మహేశ్వరరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొణతాల వెంకటరావు, కర్రి దివాకర్రావు, కాంద్రేగుల సత్యనారాయణ, మల్ల గణేష్, కోరుబిల్లి మహాలక్ష్మి నాయుడు, కాంద్రేగుల గోపికృష్ణ, విల్లూరి రమణబాబు, విల్లూరి సత్తిబాబు, భీమరశెట్టి వర పాల్గొన్నారు.

పెందుర్తి: జివిఎంసి 97వ వార్డు పరిధి చినముసిడివాడ సత్యసాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో సాయిబాబా 99వ పుట్టినరోజు వేడుకలను శనివారం నిర్వహించారు. తెల్లవారు జామున నగరసంకీర్తనతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. భజన మండలి ఆధ్వర్యాన 70 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. వేలాది మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. టిడిపి నాయకులు శానాపతి శంకరరావు, బిజెపి నాయకులు ముమ్మన దేముడు, భజన మండలి కన్వీనర్ రమేష్, సేవాదళ్ ఇన్ఛార్జి భాస్కర్ శ్రీనివాస్, సత్యవాణి, చలపతిరావు, ఎమ్.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న సర్పంచ్

రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -మాడుగుల: రానున్న రబీ సీజన్కు సంబందించి మండలంలో సత్యవరం గ్రామ రైతు భరోసా కేంద్రంలో శనివారం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ సహాయ అధికారి వరప్రసాద్ ఆద్వర్యంలో గ్రామ సర్పంచ్ జెర్రీ పోతుల నాగమణి రామారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తలారి అప్పారావు పాల్గొన్నారు.

రోలుగుంటలో క్రిస్మస్ ర్యాలీ

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట రోమన్ కేథలిక్ చర్చి ఆధ్వర్యంలో కొత్తకోట విచారణ గురువు అజయ్ కుమార్ ఆధ్వర్యంలో క్రీస్తురాజు పురప్రదక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కొత్తకోట, రోలుగుంట, భోగాపురం, కొవ్వూరు గ్రామాలకు చెందిన క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి

- పబ్లిక్ సెక్టార్ కో - ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కెఎం.కుమార్ మంగళం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రభుత్వరంగంలో కొనసాగించాలని పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కె.ఎం కుమార్ మంగళం డిమాండ్ చేశారు.స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన తలపెట్టిన దీక్షలు శనివారం నాటికి 1339 వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గత ప్రభుత్వ హాయాం కంటే టిడిపి,జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగంలో కొనసాగుతుందా లేదా అనే అనుమానాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కూటమి వచ్చాక కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్ పేరుతో బయటకు నెట్టేయడం జరుగుతుందన్నారు. అక్కడతో ఆగకుండా టౌన్ షిప్ లో కార్మికుల ఇళ్లకు కరెంట్ చార్జీలు పెంచడం, ఉద్యోగులకు, కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం వంటి చర్యలు మోడీ ప్రభుత్వం వేగవంతం చేసినా, దానిని అడ్డుకట్ట వేయలేదన్నారు. ఈ నెల 29 న మోడీ విశాఖకు వస్తున్న సందర్భంగా,స్టీల్ ప్లాంట్ అమ్మబోమని ముందుగానే ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.కార్మిక సంఘాల డిమాండ్ మేరకు ప్లాంట్ ను సెయిల్ లో విలీనం చేస్తామని చెప్పాకే మోడీ విశాఖ లో అడుగుపెట్టాలన్నారు. లేని పక్షంలో మోడీని అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు జి.వి.యన్.చలపతి,

నినాదాలు చేస్తున్న నాయకులు

కార్యదర్శి పి.వెంకటరావు, కె.కుమారి,అనపర్తి అప్పారావు, శివ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిఆర్‌ఫ్ టీం సభ్యులు

ప్రకృతి విపత్తులపై అవగాహన

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవలసిన జాగత్తలపై అవగాహన కలిగి ఉండాలని (ఎన్.డి.ఆర్.ఎఫ్) 10వ బెటాలియన్ టీం కమాండరు వై.సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కమ్యూనిటీ అవేర్‌నెస్ కార్యక్రమం ద్వారా ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, విపత్తు నివారణ, నిర్వహణ, వడగండ్ల వాన, కుంభవష్టి, బలమైన గాలులు వీచునపుడు తీసుకోవలసిన జాగ్రత్తల ను వివరించారు.10వ ఎన్‌డిఆర్‌ఎఫ్ బెటాలియన్ కమాండెంట్ వివిఎన్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ఈనెల 27వ తేదీ వరకు కోస్తా తీర మండలాలలో గ్రామాలు, పాఠశాలలు, పరిశ్రమలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి మోహన్

పెండింగ్ కేసులను త్వరగా విచారించాలి

-డిఎస్‌పి మోహన్

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ పోలీస్‌స్టేషన్‌ను నర్సీపట్నం డీఎస్పీ జిఆర్.మోహన్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు త్వరగా విచారణ చేయాలన్నారు. అదే విధంగా ఎంవి కేసులు, త్రిపుల్ రైడింగ్, వాహనాలు స్పీడ్ డ్రైవింగ్, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్సై పీ.రామారావు ఉన్నారు.

దరఖాస్తులు పరిశీలిస్తున్న బిఎల్‌ఓ

బిఎల్‌ఓ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -కోటవురట్ల:బూత్ స్థాయి అధికారులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తహసిల్దారు తిరుమల బాబు సూచించారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025లో భాగంగా జరుగుతున్న బిఎల్ఓ కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, ఓటు హక్కు లేని వారందరికీ ఓటు హక్కు కల్పించి తప్పులను సవరణ చేయాల్సిన బాధ్యత బిఎల్‌వోల పై ఉందన్నారు. విధుల పట్ల అలసత్వం నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. పలు గ్రామాల నుంచి 23 వివిధ దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఆదివారం కూడా బిఎల్వోలు విధులలో పాల్గొంటారని తెలిపారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రోలుగుంట:ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్) రోలుగుంట మండల కార్యవర్గ ఎన్నిక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ కార్యవర్గ ఎన్నికకు జిల్లా పరిశీలకులుగా అనకాపల్లి జిల్లా సహాధ్యక్షురాలు పి.గాయత్రి హాజరయ్యారు. వీరి సమక్షంలో రోలుగుంట మండల కార్యవర్గ ఎన్నిక జరిగింది. రోలుగుంట మండల గౌరవ అధ్యక్షులుగా కె.కేశవరావు, అధ్యక్షులుగా కాళింగ సతీష్, సహాధ్యక్షులుగా బోనిల భారతి, ప్రధాన కార్యదర్శిగా యు.నాగభూషణం, కోశాధికారిగా డి.అప్పారావు(వంశీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా ఎన్నికైన కాళింగ సతీష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కులు కోసమే కాకుండా ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణకు, విద్యార్థుల సమస్యల పట్ల యుటిఎఫ్ నిరంతరం పోరాడుతుందని

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

తెలియజేశారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన యు.నాగభూషణం మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు.

ఇంటింటా సర్వేకు సహకరించాలి

-జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంటింటా వార్డు కార్యదర్శుల చేపడుతున్న జియో ట్యాగ్ సర్వేకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ కోరారు. శనివారం జీవీఎంసీ అధికారులతో కలసి వార్డు కార్యదర్శులు చేపట్టిన జియో ట్యాగ్ సర్వే పై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, విశాఖ నగరంలో ఇంటింటి నుండి జరుగుతున్న జియో ట్యాగ్ సర్వే ఇప్పటివరకు 50 శాతమే పూర్తయిందని, సర్వే ఆలస్యం పై అధికారులను ఆరా తీశారు. వార్డు కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్న సమయంలో వివరాల సేకరణకు స్పందించడంలో ప్రజలు అపోహలు వ్యక్తం చేస్తున్నారని అధికారులు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రతి ఇంటిలో కుటుంబ సభ్యుల పూర్తి వివరాలతో జియో టాక్ సర్వే నిర్వహిస్తుందని, ప్రజలకు అపోహ కలుగకుండా వార్డు కార్యదర్శులు అవగాహన కల్పించి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

నర్సరీ స్థలాల పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట అటవీ రేంజ్ కార్యాలయాన్నినర్సీపట్నం సబ్ డిఎఫ్ఓ సునీల్ కుమార్ శనివారం సందర్శించారు. అనంతరం అటవీశాఖ ఆధ్వర్యంలో జరుగతున్న నర్సరీల పెంపకం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, కృష్ణదేవిపేట రేంజ్‌కు సంబంధించి 20వేల బ్యాగ్ నర్సరీ ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు ఉపయోగపడే మొక్కలను పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో రేంజర్ కే.శ్రీనివాసరావు, డీఆర్వో సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న సబ్ డిఎఫ్‌ఒ సునీల్ కుమార్

వైద్యులతో మాజీ ఎమ్మెల్యే గణేష్

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు సర్జరీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్‌కు గత రెండు సంవత్సరాల క్రితం పార్టీ కార్యక్రమాల్లో భాగంగా గొలుగొండ మండలంలో ర్యాలీ జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో కాలుకు దెబ్బ తగిలిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఆయన నడవడానికి ఇబ్బంది పడేవారు. ఎన్నికల సమయంలో బిజీ కావడంతో తిరిగినప్పటికీ నడవడానికి ఇబ్బందులకు గురైయ్యేవారు. ఈ క్రమంలో ఆయనకు హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో రోబోటిక్ హిప్ రిప్లేస్మెంట్ సర్జరీ విజయవంతం అయ్యిందని కుటుంబ సభ్యులు, స్థానిక ఆర్థోపెడిక్ వైద్యులు హనుత్తేజ్ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి - మాడుగుల: ప్రపంచ యాంటీ మైక్రో బియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగం గా పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లలో యాంటీబయోటిక్స్, ఇతర ఔషధాల వినియోగం వంటి వాటిపై మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు స్థానిక డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన కల్పించారు. అవసరం లేకుండా ఔషధాల వినియోగం కారణంగా పశువుల్లో కలిగే దుష్ప్రభావాలు, అతిగా ఆంటిబయోటిక్స్ వాడితే వచ్చే ప్రభావాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాస్త్రి , జి. జయలక్ష్మీ, షర్మిల శ్రీ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న పశువైద్య సహాయ సంచాలకులు

అందరి సహకారంతో క్రీడలు నిర్వహించాలి

-జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, జిల్లా క్రీడా సంఘాలు కలిసి సమన్వయంతో క్రీడా క్యాలెండర్ రూపొందించి, క్రీడలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో క్రీడా మైదానాల ఏర్పాటు, క్రీడల అభివృద్ధికి చేయవలసిన ప్రణాళికలపై జివిఎంసి, విఎంఆర్‌డిఎ, ఈ.కో రైల్వే, విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్, క్రీడా సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారిని జూన్ గ్యాలియెట్, ది ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కే.సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, జయరాం, నాగిశెట్టి ఉష, క్రీడా సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో చిన పాచిలి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ రైతు శనివారం ఉదయం పాము కాటుకు గురి అయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం... చినపాచిల గ్రామానికి చెందిన సాసుబిల్లి రామనాయుడు ఉదయాన్నే పొలంలోకి వెళ్లాడు. పాము కాటుతో గురైన రామనాయుడు ఆందోళనకు గురి కావడంతో సమీపంలో గల వ్యక్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్తలానికి చేరుకున్న కుంటు సభ్యులు హుటా హుటిని రావికవంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

అవంతిలో ముగిసిన వర్క్ షాప్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ గ్రాఫిక్స్‌పై ఈ నెల 19న ప్రారంభమైన వర్క్ షాప్ శనివారంతో ముగిసింది. ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.నారాయణరావు మాట్లాడుతూ, వర్క్‌షాప్‌లో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సురేష్, వర్క్ షాప్ కన్వీనర్ పట్నాయక్, కో-ఆర్డినేటర్ జి.రాము, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.